# 11

# ఆత్మ యొక్క లంగరు

## (6:9-20)

హెబ్రీ పత్రిక గ్రంథకర్త తన పాఠకులకు నాశనమును గురించి అంచుల దాకా చూపించాడు.[1] అతడు ప్రమాదపుటంచువరకు తీసుకెళ్ళి క్రిందనున్న ప్రమాదాలను చూపిస్తున్నాడు. అక్కడినుండి వెనక్కు తీసుకువచ్చి “అయితే ప్రియులారా మేమీలాగు చెప్పుచున్నను, మీరింతకంటె మంచిదియు, రక్షణకరమైనదియునైన స్థితిలోనే ఉన్నామని రూఢిగా నమ్ముచున్నాము” (6:9) అని చెప్తున్నాడు. వారికి నిరీక్షణ మరియు భద్రతను ఇచ్చి వారి జీవితములను క్రీస్తులో లంగరు వేయుమని (6:19) కోరుతున్నాడు.

“రక్షణకరమైన స్థితి” అన్న పదం వేదాంతవేత్తలు, ఉపదేశకులు, బోధకులకు ఆకర్షణీయంగా కనబడుతుంది. ఈ పదం గురించే కొన్ని గ్రంథాలు వ్రాయవచ్చు; ఎన్నో ప్రసంగాలు చేయవచ్చు. పాఠకులు తాము రక్షించబడ్డాము అని తెలియజేయడానికి తమ జీవితాల్లో కనబడే విషయాలే ఈ రక్షణకరమైన విషయాలు. ఉదాహరణకు వారి పరిచర్య.

“రక్షణకరమైన స్థితి” అని చెప్తున్నాడంటే, 9వ వచనం ప్రోత్సాహకర వాక్యం అని తెలుస్తుంది. తన పాఠకులు ఉండవలసినంత స్థితిలో లేరని వారు తప్పిపోయి పతనమయ్యే ప్రమాదంలో ఉన్నారని గ్రంథకర్త తెలియజేస్తున్నాడు. “నాకు మీ మీద నమ్మకం ఉంది. ఇది మీకు జరుగుతుందని నేను అనుకోవడం *లేదు*” అని అతడు వ్రాస్తున్నాడు. ఇతరులు మనయందు నమ్మకముంచడం ఎంతో సహాయపడుతుంది!

ఈ క్రైస్తవులు పతనం కాకుండా ఏది సహాయపడుతుంది? వారిని ఏది ప్రోత్సహిస్తుంది? వారు నమ్మకస్థులుగా ఉండేందుకు ఏది దోహదపడుతుంది? వారికి అవసరమైంది నిరీక్షణ. 11వ వచనాన్ని చూడండి: “మీలో ప్రతివాడును మీ *నిరీక్షణ* పరిపూర్ణమగు నిమిత్తము మీరిదివరకు కనుపరచిన ఆసక్తిని తుదమట్టుకు కనుపరచవలెనని అపేక్షించుచున్నాము” (నొక్కి చెప్పింది నాది). తరువాత 18, 19 వచనాల్లోని ఈ పదాలను గమనించండి: “మన యెదుట ఉంచబడిన *నిరీక్షణను* చేపట్టుడి ... ఈ *నిరీక్షణ* నిశ్చలమును స్థిరమునై, మన ఆత్మకు లంగరువలె నుండి తెరలోపల ప్రవేశించుచున్నది” (నొక్కి చెప్పింది నాది). ఇదివరకటి కాలంలో లంగరు భద్రతకు సూచనగా ఉండేది. అభద్రత లోకంలో మనకు భద్రత ఎంతో అవసరం, నిరీక్షణ మనకు దాన్ని యిస్తుంది.

వాక్యపర నిరీక్షణ అనేది కేవలం ఒక భావన కాదు. ఇది ఆశ మరియు ఎదురు చూపు. 1 కొరింథీయులకు 13:13లో ఇది మూడు లక్షణాలలో ఒక లక్షణంగా చెప్పబడింది: విశ్వాసం, నిరీక్షణ మరియు ప్రేమ. విశ్వాసం, ప్రేమ గురించి ఎన్నో పాఠములు చెప్పబడ్డాయి గానీ నిరీక్షణ గురించి కొన్ని మాత్రమే చెప్పబడ్డాయి. మన వాక్య భాగం నిరీక్షణను గురించిన వాక్య భాగాలలో ఒక మంచి వాక్య భాగము. నిరీక్షణ కలిగియుండుటకు అనేక కారణాలున్నాయి.

**1. దేవుని స్వభావమును బట్టి (6:10ఎ)**

దేవుడు అన్యాయస్థుడు కాడు. మన "ప్రేమ పరిచర్యను" దేవుడు మర్చిపోడు. మానవులముగా మనం మర్చిపోతాము గాని, దేవుడు మర్చిపోడు.

**2. మన చేతనైనది మనం చేస్తున్నాము కాబట్టి (6:10బి–12ఎ)**

ఈ పత్రిక ఎవరికి వ్రాయబడిందో ఆ పాఠకులు చేసిన పరిచర్య అంతగా పరిపూర్ణమైనది గాకపోయినా గాని అది ప్రేమతో కూడిన పరిచర్య. వారిదివరకు తోటి క్రైస్తవులకు సాయం చేశారు. వారు అప్పటికే పరిశుద్ధులకు పరిచర్య చేస్తు ఉన్నారు. "కాబట్టి మీరు మందులు గాక ... తుదమట్టుకు ఆసక్తిని కనుపరచవలెనని" గ్రంథకర్త వారిని ప్రోత్సహిస్తున్నాడు. మనం సంపూర్ణులముగా ఉండాలని దేవుడు కోరుకోవడం లేదు కాని మనకు చేతనైంది మనం చేయాలని ఆయన ఆశిస్తున్నాడు. మనమలా చేసినప్పుడు ఆయన సంతోషిస్తాడు. ఈ మొదటి రెండు కారణాలను కలిపి చూస్తే మనకు "నిరీక్షణ నిశ్చయతగా వస్తుంది"!

**3. ఎందుకంటే, ఇదివరకు నమ్మకస్థులుగా ఉన్నవారిని దేవుడు ఆశీర్వదించాడు కాబట్టి (6:12బి–15)**

"విశ్వాసము చేతను, ఓర్పుచేతను వాగ్దానములను స్వతంత్రించుకొనువారిని పోలి నడుచుకొనుడి" (12బి వ.) అని గ్రంథకర్త ప్రోత్సహిస్తున్నాడు. అదే సవాలును 11వ అధ్యాయంలోనూ కొనసాగిస్తున్నాడు. ఇందుకు అబ్రాహామును ఉదాహరణగా చూపిస్తున్నాడు (13–15వచనాలు). దేవుడు అబ్రాహామునకు గొప్ప వాగ్దానము చేశాడు. కాని అవి నెరవేరుటకు ఎన్నో ఏళ్ళు పట్టాయి. మరి ఈ మధ్యకాలంలో అబ్రాహామునకు ఏది సహాయ పడింది? అతని *నిరీక్షణ* (చూడు రోమీయులకు 4:18).

**4. ఎందుకంటే దేవుడు అబద్ధమాడడు (6:16–18)**

దేవుడు అబద్ధమాడడు అన్న సత్యం 13వ వచనంలోనే చెప్పబడింది, గాని 16–18వచనాల్లో ఇది వివరించబడింది. దేవుడు ఒక వాగ్దానం చేసినప్పుడు, దాన్ని మన జీవితాల్లో నమ్మాలి! మనం నిరీక్షణ కలిగియుండగలము!



## 5. ఎందుకంటే మన నిరీక్షణ యేసునందు లంగరు వేయబడియుంది (6:18బి-20[2])

ఈ లోకపు సమస్యల నీటిమీద మన జీవితములు లంగరు వేయబడియుండలేదు గాని, పరలోకంలోని అతి పరిశుద్ధ స్థలంలోనే వేయబడియున్నాయి.

దీని ప్రాధాన్యత ఏమిటి? అక్కడే యేసు ఉన్నాడు. మన లంగరుకు భద్రత నిర్మించుటకు ఆయన పరలోకంలో ఉన్నాడు. యేసునందు, ఆయన మన నిమిత్తం చేసినకార్యమునందు మన నిరీక్షణయుంది (చూడు కొలొస్సయులకు 1:27).

20వ వచనంలో యేసు మన ప్రధాన యాజకుడు అన్న విషయానికి గ్రంథకర్త తిరిగి వస్తున్నాడు. ప్రత్యేకించి, "మెల్కీసెదెకు క్రమము చొప్పున" యేసు మన ప్రధాన యజకుడు అన్న విషయానికి గ్రంథకర్త తిరిగివస్తున్నాడు (చూడు 5:10). ఈ వాక్యభాగము విషయాన్ని "నీడ మరియు నిజము" అన్న తరువాత పాఠములో చూస్తాము.

---

## ఉపదేశకులకు సూచనలు

నిరీక్షణను గురించిన అంశము హెబ్రీ పత్రిక అంతటా కన్పిస్తుంది (చూడు 3:6; 7:19; 10:23).

---

సూచనలు

[1]ఆత్మీయ ఎదుగుదల యొక్క అవసరతలోని 6:6, 8 వచనాలను గురించిన పాఠమును చూడు. [2]ప్రత్యక్ష గుడారములో పరిశుద్ధ స్థలం మరియు అతి పరిశుద్ధ స్థలమునకు మధ్య ఒక తెర ఉంటుంది. ఈ పుస్తకంలో కనబడే ప్రత్యక్షగుడారపు బొమ్మను చూడండి.